సాక్షి
వికారాబాద్
సోమవారం । 5 । ఆగస్టు । 2024

నేడు అభివృద్ధి పనులకు శ్రీకారం

శంకుస్థాపన చేయనున్న మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

తాండూరు: నియోజకవర్గంలో నేడు (సోమవారం) వివిధ అభివృద్ధి పనులు, ప్రారంభోత్సవాలకు మంత్రులు శ్రీకారం చుట్టనున్నారు. స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి తోపాటు పలువురు ప్రజా ప్రతినిధులు తాండూరులో పర్యటించనున్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఉదయం 11గంటలకు క్యాంపు కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తారు. 11.30గంటలకు గొల్లచెరువు సుందరీకరణ పనులకు శంకుస్థాపన, తాండూరు పట్టణంలోని ముర్షద్ దర్గా నుంచి కింగ్స్ ప్యాలెస్ వరకు సీసీ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేస్తారు. అమృత్ 2.0 పథకంలో భాగంగా నీటి సరఫరా పనులను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం మండలంలోని జినుగుర్తి, చంద్రవంచ, కందనెల్లి, జుంటిపల్లి గ్రామాల్లో విద్యుత్ సబ్ స్టేషన్లను ప్రారంభిస్తారు. 1.30 గంటలకు తాండూరు – మహబూబ్‌నగర్ మార్గంలోని చిలుక వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. 2 గంటలకు ఎస్వీఆర్ గార్డెన్‌లో తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కమిటీ సభ్యుల పదవీ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరవుతారు. అనంతరం బషీరాబాద్ మండలంలో పర్యటిస్తారు. అక్కడ బషీరాబాద్ – కరన్‌కోట్ గ్రామాల మధ్య డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన, సాయంత్రం 4 గంటలకు కొర్విచెడ్ గని గ్రామ సమీపంలోని ఫంక్షన్ హాల్‌లో జరిగే మార్కెట్ కమిటీ పదవీ ప్రమాణ స్వీకారంలో పాల్గొంటారు. తిరుగు ప్రయాణంలో పట్టణంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్లను పరిశీలించనున్నారు.


అభివృద్ధి పనులకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

హాస్టల్ విద్యార్థులకు అస్వస్థత


వికారాబాద్ ఆస్పత్రిలో విద్యార్థులు

అనంతగిరి: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఇటీవల అనంతగిరిపల్లి సమీపంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఇదే పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులకు జాండీస్ లక్షణాలు ఉండటంతో సిబ్బంది శనివారం రాత్రి వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ఇదిలా ఉండగా ఆదివారం మధ్యాహ్నం వికారాబాద్ పట్టణం బూర్గుపల్లి సమీపంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ (మోమిన్‌పేట)కు చెందిన 8 మంది విద్యార్థినులకు జ్వరాలు రావడంతో వారిని కూడా వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యం చేయించుకున్న అనంతరం వసతిగృహానికి తీసుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆస్పత్రికి వచ్చి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. గురుకులాల్లో పారిశుద్ధ్యం లోపించడం, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం, తాగునీరు, మరుగుదొడ్లు సరిగ్గా లేకపోవడంతోనే తమ పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వసతి గృహ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్ తెలిపారు.

వైద్య శిబిరాలతో పేదలకు మేలు

ధారూరు: మండలంలోని కొండాపూర్‌కలాన్‌లో ఆదివారం జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హైదరాబాద్ అపోలో ఆస్పత్రి డాక్టర్ల బృందం 350మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బీజేపీ వికారాబాద్ కోఆర్డినేటర్ నందు, డాక్టర్లు ప్రియ, నిషా, హైమావతి, రుత్విక్, అలేఖ్య, కేశవులు పాల్గొన్నారు.





బోనమెత్తిన రాంపూర్


బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

బంట్వారం: కోట్‌పల్లి మండలం రాంపూర్‌లో ఆషాఢ మాసం బోనాల వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పుళ్ల మధ్య మహిళలు బోనాలతో ఊరేగింపుగా మైసమ్మ ఆలయానికి చేరుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పాడి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని వేడుకున్నారు. వేడుకల్లో గ్రామపెద్దలు, మహిళలు, యువతీ యువతులు పాల్గొన్నారు.





క్లుప్తంగా

కుల రహిత సమాజానికి కృషి

కేఎన్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అభినవ్


సమావేశంలో మాట్లాడుతున్న అభినవ్

కొడంగల్ రూరల్: కుల రహిత సమాజానికి కృషి చేయాలని కేఎన్‌పీఎస్(కుల నిర్మూలన పోరాట సమితి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూరం అభినవ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సమితి జిల్లా అధ్యక్షుడు ఏర్పుల చంద్రప్ప అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. కారంచెడు నుంచి చుండూరు వరకు దళితులపై జరిగిన దాడుల్లో అమరులైన దళిత వీరులను స్మరించుకోవాలని సూచించారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా దోపిడీ వ్యవస్థ మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోరాట యోధులను స్మరించుకుంటూ.. వారు చూపిన బాటలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో సమితి కొడంగల్, బొంరాస్‌పేట మండలాల అధ్యక్షులు అంజి, అంజిలప్ప, బొంరాస్‌పేట మండల ప్రధాన కార్యదర్శి అంజి, అంబేడ్కర్ యుజన సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

విహార యాత్రతో విషాదం

చెట్టును ఢీ కొన్న కారు
అల్లీఖాన్ యువకుడి మృతి


రమేశ్(ఫైల్)

దుద్యాల్: శ్రీశైలం విహార యాత్రలో విషాదం చోటు చేసుకుంది. చెట్టును కారు ఢీ కొన్న ఘటనలో మండల వాసి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. దుద్యాల మండలం అల్లిఖాన్ పల్లి గ్రామానికి చెందిన కావలి రమేశ్(20), హైదరాబాద్ బొల్లారానికి చెందిన స్నేహితులతో కలిసి ఆదివారం విహార యాత్రకు బయల్దేరాడు. ఈ క్రమంలో అచ్చంపేట మండలం దోమల పెంట దగ్గర వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి చెట్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రమేష్‌తో పాటు అతడి స్నేహితులు మృత్యువాత పడ్డారు. ఘటన విషయం తెలియడంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. స్నేహితుల దినోత్సవాన ముగ్గురు మిత్రులు దుర్మరణం చెందడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం


కిందపడిన విద్యుత్ స్తంభం

మొయినాబాద్: రాత్రి సమయంలో అతివేగంతో వచ్చిన ఓ కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొని రోడ్డు కిందికు దూసుకుపోయింది. ఈ సంఘటన శనివారం అర్ధరాత్రి మండల పరిధిలోని అమ్డాపూర్ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని గచ్చిబౌలిలో ఉండే ఓ షోరూంలో పనిచేసే ముగ్గురు శనివారం రాత్రి కారులో అమ్డాపూర్ వైపు వెళ్తున్నారు. మార్గమధ్యలో కాశింబౌలి గేటు వద్ద ఉన్న మూలమలుపుపై కారు అతివేగంతో వెళ్లి పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి రోడ్డు కిందికు దూసుకెళ్లారు. దీంతో విద్యుత్ స్తంభం విరిగి కింద పడిపోయింది. కారులో ఉన్నవారికి మాత్రం ఎలాంటి గాయాలు కాలేదు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

సేవ్ దామగుండం..


దామగుండం అటవీ ప్రాంతం

- ఆందోళన బాటపట్టిన ప్రజాసంఘాలు
- రాడార్ ఏర్పాటును వ్యతిరేకిస్తున్న వైనం
- రేడియేషన్‌తో పచ్చదనం, జీవకోటి ప్రాణానికి ముప్పు
- కాలుష్య కారక ప్రాజెక్టులు వద్దంటూ నినాదాలు

పూడూరు: దామగుండం అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న నేవీ రాడార్ స్టేషన్‌ను పలువురు ప్రజాప్రతినిధులతో పాటు.. సామాన్యులు, ప్రజా సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. పూడూరు మండలం దామగుండం అడవి 2900 ఎకరాల్లో నేవీ సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టిన విషయం విధితమే. సముద్ర మట్టానికి 350 మీటర్ల ఎత్తులో ఉండటంతో సిగ్నల్ వ్యవస్థకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఈ ప్రాంతాన్ని ఎంచుకున్నట్లు నేవీ అధికారులు వెల్లడించారు. రాడార్ ఏర్పాటుతో ఈ ప్రాంత పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని పర్యావరణ వేత్తలు, ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

జీవరాశిపై రేడియేషన్ ప్రభావం

సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటుతో ఆహ్లాదకమైన వాతావరం కోల్పోవడంతో పాటు, రేడియేషన్‌తో ప్రాణాంతకమైన వ్యాధులు సంక్రమించనున్నట్లు పర్యావరణ నిపుణులు స్పష్టంచేస్తున్నారు. అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల మనుగడ కష్టం అవుతుందని చెప్పారు. భారీగా భూమిని స్వాధీనం చేసుకుంటే వన్యప్రాణుల ఉనికి ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇలాంటి ప్రాజెక్టులను అడ్డుకుంటామని ప్రజా సంఘాల ప్రతినిధులు స్పష్టంచేస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం మండల కేంద్రంలో 'సేవ్ దామగుండం- సేవ్ వికారాబాద్' పేరిట ఆందోళన వ్యక్తంచేశారు.



పూడూరులో ఆందోళన చేస్తున్న ప్రజాసంఘాలు

అడ్డుకుంటాం



ప్రజలకు, ప్రాంతానికి హానీ కలిగించే ఎలాంటి ప్రాజెక్టులనైనా అడ్డుకుంటాం. రేడియేషన్ వలన జీవకోటికి ఇబ్బందులు వస్తాయనే ప్రాజెక్టు ఏర్పాటుకు అనుమతులు ఇవ్వకుండా గత ప్రభుత్వం అడ్డుకుంది. పరిసర ప్రాంత ప్రజల అభిప్రాయాలను సేకరించకుండా అటవీ శాఖ దామగుండ అటవీ భూములను రక్షణ శాఖకు అప్పగించడం సరైందికాదు. నేవీ రాడార్ ఏర్పాటు ఆలోచనను ప్రభుత్వాలు విరమించుకోవాలి.

– శ్రీనివాస్‌గౌడ్, పూడూరు

కాలుష్య కారక ప్రాజెక్టులు వద్దు



ఆహ్లాదకరమైన వాతావరణాన్ని దెబ్బతీసే ప్రాజెక్టులు వద్దంటే వద్దు. ఈ ప్రాంతం ప్రకృతి సంపదతో ఉట్టి పడుతుంది. చరిత్ర కలిగిన రామలింగేశ్వర ఆలయం ఉంది. సిగ్నల్ రేడియేషన్ ప్రభావం జీవరాశిపై తీవ్ర ప్రభావం చూపనుంది. పర్యావరణానికి హానీ కలిగించే నేవీ రాడార్‌ను అడ్డుకునేందుకు సిద్ధంగా ఉంటాం.

– వెంకటయ్య, ఆర్టీఐ కన్వీనర్

ఆలయానికి వెళ్లాలంటే ఆంక్షలు


రామలింగేశ్వర స్వామి ఆలయ పుష్కరిణి

రాడార్ ఏర్పాటుతో లక్షలాది వృక్షజాతి సంపద, జీవరాశులతో పాటు ఐదు శతాబ్దాల చరిత్ర కలిగిన దామగుండ రామలింగేశ్వర స్వామి ఆలయం మనుగడకు ప్రమాదం ఏర్పడనుందని, ప్రాంతం మొత్తం కాలుష్యకోరల్లో చిక్కుకోనుందని పర్యావరణ వేత్తలు పేర్కొంటున్నారు. ప్రసిద్ధిగాంచిన రామలింగేశ్వరున్ని దర్శించుకోవాలనే భక్తుల కోరిక దినదిన గండంగా మారనుందని, గుడికి వెళ్లాలంటే ఇకమీదట ఆంక్షలు విధించనున్నారని వెల్లడించారు. పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్రాజెక్టులు అవసరం లేదని స్పష్టంచేస్తున్నారు. రాడార్‌కు వ్యతిరేకంగా దేశ వ్యాప్త ఆందోళనలకు సిద్ధం కానున్నట్లు పేర్కొంటున్నారు. కేంద్రం పనులకు గత నెల 28న భూమిపూజకు ముహూర్తం ఖరారు చేసినప్పటికీ.. సాంకేతిక కారణాలతో నిలిచిపోయింది.

నిధులు ఇస్తేనే.. విధులు!


- స్వచ్ఛదనం.. పచ్చదనం చేయలేం
- ఆర్థికభారం మోపడం సరికాదు
- పంచాయతీ కార్యదర్శుల ఆవేదన

కుల్కచర్ల: పైసలు లేకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేమని మండల పంచాయతీ కార్యదర్శులు చెప్పారు. ఆదివారం ఎంపీడీఓ కార్యాలయంలో చేపట్టిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమ సమీక్షలో కార్యదర్శులు మాట్లాడారు. గ్రామాల్లో ప్రత్యేక పాలన కొనసాగుతున్న నేపథ్యంలో అధికారులే ఖర్చులు భరిస్తున్న పరిస్థితి ఉందని పేర్కొన్నారు. వాటికి సంబంధించిన డబ్బులే ఇప్పటి వరకు రాలేదని, కొత్తగా స్వచ్ఛదనం పేరిట కార్యక్రమాలు చేపట్టాలంటే మా వల్లకాదన్నారు. నిధులు విడుదల చేయకుండా పనులు చేపట్టలేమని, తమపై ఆర్థికభారం మోపడం భావ్యం కాదని, ప్రత్యేక కార్యక్రమానికి దూరంగా ఉంటామని వెల్లడించారు. సామూహికంగా సెలవులు ఇవ్వాలని, పేర్కొంటూ ఎంపీడీఓ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. నిధులు కేటాయించిన అనంతరం అభివృద్ధి పనులు చేపడతామని స్పష్టంచేశారు.


ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న జీపీ కార్యదర్శులు

మొదటి నెల జీరో..

- రెండో నెల రూ.5 వేల కరెంటు బిల్లు
- వినియోగదారుడి ఆందోళన
- వివరణ కోరితే విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్య సమాధానం



రైతు దయాకర్‌రెడ్డి మొదటి నెల జీరో బిల్లు



రెండో నెల రూ.5,335లు చెల్లించాలంటూ ఇచ్చిన బిల్లు

ధారూరు: 'మీటరు తీసుకున్నా నాటి నుంచి ఇంత పెద్దమొత్తంలో నా ఇంటి కరెంటు బిల్లు రాలేదు. మొదటి నెల జీరో బిల్లు ఇచ్చారు. రెండో నెల రూ.5,339 బిల్లు ఎలా ఇస్తారని' ట్రాన్స్‌కో ఏఈని వినియోగదారుడు వివరణ కోరగా.. 'అవును వచ్చింది. ఏం చేస్తావ్. చెల్లించక తప్పదు. ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో. నేను సీఎం బంధువును' అంటూ నిర్లక్ష్య సమాధానం చెప్పాడని కేరెల్లి గ్రామానికి చెందిన రైతు దయాకర్‌రెడ్డికి ఆందోళన వ్యక్తంచేశారు. ఇలాంటి పరిస్థితి ఈ ఒక్క వ్యక్తికే కాదు. మండల పరిధి అనేక విద్యుత్ వినియోగదారులకు ఎదురవుతున్నట్లు సమాచారం.

113 యూనిట్ల నుంచి 657కు జంప్

ప్రతి నెల ఒకటో తేదీన రీడింగ్ తీసి బిల్లు ఇవ్వాల్సిన విద్యుత్ సిబ్బంది.. వారం రోజులు ఆలస్యం చేస్తున్నారు. ఏ ఒక్క నెలలో అదనంగా ఏడు రోజులు గడిచినా.. బిల్లులో మాత్రం 30 లేదా 31 రోజుల బిల్లుగా వస్తుంది. కేరెల్లి రైతు గత నెలలో 113 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగిస్తే.. ప్రస్తుత నెలలో 657 యూనిట్లు వాడినట్లు బిల్లు చూపడం గమనార్హం. దీంతో రీడింగ్ తీయడంలో వినియోగదారులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ఎప్పటిలాగే విద్యుత్‌ను వినియోగిస్తున్నా.. రీడింగ్ ఎలా పెరుగుతుందని అడిగిన వారికి.. మీటర్ ఫాల్ట్ అయి ఉంటుందని, రూ.150 డీడీ చెల్లించి కార్యాలయంలో ఇస్తే సరిచేస్తారని ట్రాన్స్‌కో సిబ్బంది చెప్పడం గమనార్హం.

జీరో బిల్లు ఏది?

తెల్ల రేషన్‌కార్డు ఉన్నా జీరో బిల్లు రాని వారు మండల పరిధిలో వేలమంది ఉన్నారు. ఇందులో చాలా మంది విద్యుత్ సిబ్బందిపైనే అనుమానం వ్యక్తంచేస్తున్నారు. గృహజ్యోతికి దరఖాస్తు చేసుకున్నా.. అనర్హులుగా పేర్కొంటూ.. బిల్లులు ఇస్తున్నారని పేర్కొంటున్నారు. ఆన్‌లైన్‌లో చెక్‌చేస్తే.. నాట్ అప్లైడ్, నాట్ మ్యాచ్ అనే పదాలు రావడం, ఎడిట్ ఆప్షన్ లేకపోవడంతో అర్హత ఉన్నా ప్రభుత్వ పథకాలకు నోచుకోలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరు గ్యారంటీల్లో ఒక్క ఉచిత బస్సు ప్రయాణానికి మాత్రమే అర్హులమయ్యామని కొందరు మహిళలు వెల్లడించారు.

హ్యాపీ ఫ్రెండ్‌షిప్ డే


స్నేహితులతో సరదాగా..


ఫొటో దిగుతున్న పర్యాటకులు

వికారాబాద్ సమీపంలోని అనంతగిరి గుట్టకు ఆదివారం పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఫ్రెండ్‌షిప్ డే కావడంతో పలువురు స్నేహితులతో కలిసి వచ్చి ఎంజాయ్ చేశారు. అడవిలో విహరించారు. నీటి ప్రవాహంలో ఆడుతూ సరదాగా గడిపారు. ఎక్కడ చూసినా స్నేహితుల గుంపులే కనిపించాయి. అంతకుముందు స్వామివారిని దర్శించుకున్నారు.

– అనంతగిరి


అనంతగిరి గుట్టలో పర్యాటకుల సందడి

విద్యుదాఘాతంతో మేకపోతు మృతి

యాలాల: విద్యుదాఘాతంతో మేకపోతు ఆదివారం మృతి చెందింది. ఇందిరమ్మ కాలనీకి చెందిన మోహన్‌కు చెందిన మేకపోతు మేత కోసం బషీర్‌మియాతండా సమీపంలోకి వచ్చింది. మేతమేస్తున్న క్రమంలో సాయిబాబా ఆలయ ముఖద్వారం సమీపంలో తెగి పడున్న విద్యుత్ తీగకు తగిలి కరెంట్ షాక్‌తో మృత్యువాత పడింది. సుమారు రూ.20వేల మేక చనిపోయిందని, తనను ఆదుకోవాలని బాధిత కాపరి మోహన్ ప్రభుత్వాన్ని కోరాడు.

బాధితులకు తప్పని నిరాశ

- మొండిచేయి చూపిన మధ్యవర్తులు
- డబ్బులు ఇప్పించాలంటూ ఠాణా చుట్టూ ప్రదక్షిణలు
- నగరానికి చేరిన వ్యాపారి వ్యవహారం

ధారూరు: వ్యాపారి మోసానికి గురైన బాధితులకు మరోసారి నిరాశే ఎదురయింది. ఒప్పందం ప్రకారం పోగొట్టుకున్న దాంట్లో 40శాతం సొమ్ము దక్కుతుందనే నమ్మకంతో ఆదివారం ఠాణాకు చేరుకున్న వారు.. ఉత్త చేతులతో వెనుదిరిగారు. వివరాలు ఇలా ఉన్నాయి. ధారూరు మండల కేంద్రంలో శ్రీరాం జ్యూవెలరీ పేరుతో దీపక్ వైష్ణవ్ నగల వ్యాపారం చేస్తుండేవారు. ఈ క్రమంలో దీపక్.. ప్రజల నుంచి సేకరించిన నగలు, నగదుతో జూన్ నెలలో ఉండాయించాడు. విషయం దిన పత్రికల ద్వారా బయటకు పొక్కడంతో ఎట్టకేలకు పోలీసులు వ్యాపారిని పట్టుకున్నారు. సదరు వ్యక్తి నుంచి కొంత బంగారు ఆభరణాలను రికవరీ చేసి, కొందరు బాధితులకు అప్పగించారు. మిగతా బాధితులకు త్వరలో న్యాయం చేస్తామని తమ బంధువుల జమానత్‌పై వ్యాపారి వెళ్లిపోయాడు.

మధ్యవర్తులు వచ్చారు

ఒప్పందం ప్రకారం వ్యాపారి దీపక్ మధ్యవర్తులు (బంధువులు) ఆదివారం వచ్చి డబ్బులు ఇస్తారని భావించి బాధితులు ధారూరు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. మధ్యవర్తులు తొలి జాబితాలో ఉన్న 40 మంది, రెండో లిస్టులోని పేర్లను పరిశీలించారు. అనంతరం తాము డబ్బులు ఇవ్వడానికి రాలేదని, నష్టపోయిన వారిలో ఎవరైనా పేదవారుంటే వారికి కొంత మొత్తం చెల్లించాలని వచ్చామని సదరు వ్యక్తులు పేర్కొన్నారు. దీంతో బాధితులు నిర్ఘాంతపోయారు. మేము నష్టపోయామని వాపోవడంతో ఎస్ఐ వేణుగోపాల్ గౌడ్ మార్కెట్ పీఎస్‌కు ఫోన్‌చేసి, డబ్బులు చెల్లించే మధ్యవర్తులను సోమవారం పీఎస్‌కు పంపించాలని కోరాడు. దీంతో పోగొట్టుకున్న డబ్బులు వస్తాయో లేవోనని బాధితులు ఆందోళన చెందుతున్నారు.

సికింద్రాబాద్‌లో ఫిర్యాదు

నగల వ్యాపారి దీపక్ మోసానికి నష్టపోయిన సికింద్రాబాద్ ప్రాంత వ్యక్తులు ఇద్దరు జులైలో మార్కెట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దీపక్‌ను మహబూబ్‌నగర్ జిల్లా కోస్గిలో అరెస్టు చేశారు. అనంతరం ఠాణాకు తరలించారు. అక్కడ బాధితులకు ఎలాంటి డబ్బులు ఇవ్వకుండానే రాజీ కుదుర్చుకుని, తమ బంధువుల జమానత్‌తో స్వరాష్ట్రం రాజస్థాన్‌కు వెళ్లిపోయాడు. వాస్తవానికి ధారూరు పోలీస్‌స్టేషన్‌కు రావాల్సిన వ్యక్తి.. ఏకంగా రాష్ట్రాన్ని దాటాడు.

స్పీకర్ చెంతకు సమస్య

నగల వ్యాపారి మోసం గురించి కొందరు కాంగ్రెస్ నాయకులు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన స్పీకర్.. వెంటనే ఎస్ఐకి ఫోన్‌చేసి డబ్బులు రికవరి చేసి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. మధ్యవర్తుల ద్వారా మోసపోయిన వారిలో ఆరుగురికి 40 శాతం డబ్బులు మూడురోజుల క్రితం మార్కెట్ పోలీసుల ద్వారా ఇప్పించారు. ఈ విషయం తెలిసిన ఇతర బాధితులు ధారూరు ఎస్ఐ చెంతకు చేరి మా డబ్బులు ఇప్పించాలని కోరారు.

క్రీడలతో మానసికోల్లాసం

తుర్కయంజాల్: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహద పడతాయని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. ఆదివారం పురపాలక సంఘం పరిధి మునగనూర్‌లో క్రికెట్ ప్రీమియర్ లీగ్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా ఆయన విజేతలకు బహుమతులను అందజేశారు.

శ్రావణం.. శుభప్రదం




శ్రీమహాదేవుని ఆలయం (ఇన్‌సెట్లో) స్వామివారు

- పూజలకు పెట్టింది మాసం
- రక్షాబంధన్, వరలక్ష్మి వ్రతం ఈ నెలలోనే
- భక్తులతో కిటకిటలాడనున్న ఆలయాలు
- ప్రత్యేక పూజలు చేపట్టనున్న భక్తజనం

కొడంగల్ రూరల్: పూజల మాసమైన శ్రావణమాసం నేటి నుంచి ప్రారంభం కానుంది. హిందువులకు పవిత్రమాసం కావడంతో అత్యంత భక్తిశ్రద్ధలతో వ్రతాలు, కఠోర ఉపవాసాలను నియమనిష్టలతో చేస్తారు. వ్రతాల మాసం, సౌభాగ్యాన్ని ప్రసాదించే మాసంగాను భావిస్తుంటారు. ఈ మాసంలో.. నేటి నుంచి నెల రోజుల పాటు ఉదయం, సాయంత్రం ఆలయాలు ఆధ్యాత్మికత భావంతో ఉట్టిపడుతుంటాయి. శ్రావణంలో చేపట్టే ఎలాంటి కార్యక్రమానికైనా ఎంతో పవిత్రత ఉంటుందని పండితులు స్పష్టంచేస్తున్నారు.

మంచి రోజులు

శ్రావణమాసం మహాశివుడికి ప్రీతిపాత్రమైనది. ఈ నెలలో శైవక్షేత్రాలన్నీ ప్రత్యేక పూజలతో అలరారుతుంటాయి. ఏడాది పొడవునా చేసే శివ పూజలు.. ముప్పై రోజుల్లో చేసే పూజలు అంతే ఫలితాలు ఇస్తాయని పురాణ హితోక్తి. అభిషేక ప్రియుడైన శివుడికి పంచ కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలను ఏకాగ్రత, ప్రశాంత మనసుతో శివుడిని ఆరాదిస్తే నవగ్రహాలు శాంతిస్తాయని పండితులు పేర్కొంటున్నారు. ఈ మాసంలో అభిషేక, విశేష పూజలు, గౌరీ వ్రతాలు అధికంగా ఆచరిస్తారు.

మహాలింగార్చన

శ్రావణ సోమవారాల్లో ఉదయం, సాయంత్రం ప్రదోషకాలంలో శివలింగానికి విశేష అభిషేకాలు చేయడం వలన అత్యుత్తమ ఫలితాలు పొందుతామని భక్తుల విశ్వాసం.

గౌరీ వ్రతం

కొత్తగా పెళ్లయిన జంట ఈ మాసంలోని సోమవారం ఇంటి ముంగిట రంగవల్లులు దిద్ది, గౌరీ దేవి అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేయడం శ్రేయస్కరం. సౌభాగ్యాన్ని, ఐశ్వర్యాన్ని ప్రసాదించే గౌరీదేవిని పూజించడం విశిష్టతతో కూడినది.

శ్రావణ మంగళ గౌరీ వ్రతం

ఈ నెల 7న (బుధవారం) ఇంటివద్ద సంతానం, సౌభాగ్యం కోసం వ్రతం చేస్తారు. అమ్మవారిని పసుపుతో అలంకరించి ప్రత్యేకంగా పూజలు చేస్తారు. మొలకలతో కూడిన ధాన్యాన్ని నూతన ముత్తైదువులకు వాయనంగా ఇస్తారు. 8,9న నాగులపంచమి జరుపుకొంటారు.

వరలక్ష్మి వ్రతం

శ్రావణంలోని రెండో శుక్రవారం కొబ్బరి కాయకు పసుపు పూసి అమ్మవారి ఆకారం తీర్చిదిద్ది, లేదా అమ్మవారి విగ్రహం ప్రతిష్ఠించి విశేష పూజలు చేస్తారు. పూజతో పాటు సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తారు.

ముత్తైదువుల పూజ

ఈ మాసంలో ప్రతి శుక్రవారం కాళ్లకు పసుపు, పారాణి రాసి ముత్తైదువులను పూజిస్తారు. మహాలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు.

భాను సప్తమి

11న సూర్య నమస్కారాలు, సూర్య స్తోత్ర పారాయణాలు చేయడంతో రోగ నివారణ జరుగుతుంది. 16న రెండో శుక్రవారం వరలక్ష్మి వ్రతం, 19న శ్రావణ రాఖీ పౌర్ణమి, హయగ్రీవ జయంతి, 20న నుంచి మూడు రోజుల పాటు రాఘవేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు. 22న సంకటహర చతుర్థి, 26న గోకులాష్టమి(శ్రీకృష్ణాష్టమి), 31న మాస శివరాత్రి, సెప్టెంబర్ 2న అమావాస్యతో శ్రావణ మాసం ముగుస్తుంది.

ఆరోగ్యానికి మేలు



ఈ పవిత్ర మాసంలో పుణ్యక్షేత్రాలు, ఆలయాలకు వెళ్లడం వలన శుభాలు కలుగుతాయి. శివపూజల్లో పాల్గొని మనసా వాచ కర్మణల త్రికరణ శుద్ధితో పూజించడం వలన ఆరోగ్యానికి మేలు చేకూరుతుంది. శ్రావణంలో శివపూజలు, ఉపవాస దీక్షలు, శివారాధనలు, శివ పురాణం చదవడంతో మంచి జరుగుతుంది.

–కిట్టుస్వామి, పట్టణ పురోహితులు, కొడంగల్

పట్టణంలోని పుణ్యక్షేత్రాలు


అతిపెద్ద పాణివాటంతో గాడిబాయి శివలింగం


శ్రీమహాలక్ష్మి వేంకటేశ్వర స్వామివారు

శ్రీమహాలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసం మూడో శనివారం లక్ష మంది భక్తులు గోత్రనామాలతో లక్ష తులసి అర్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. గాడిబాయి శివాలయం, మహాదేవుని ఆలయాల్లో ప్రతి సోమవారం రుద్రాభిషేకాలు, నిత్యం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. జగద్గురు నిరంజన మఠంలో నిత్య రుద్రాభిషేకం, చితారు పెరుమాళ్ల ఆంజనేయస్వామి సన్నిధిలో రాత్రి భజన చేస్తారు. వీరభద్రేశ్వర దేవాలయంలో నిత్య పూజ, చెన్నకేశవస్వామి, రాఘవేంద్ర స్వామి ఆలయాల్లో రాఘవేంద్రస్వామివారి ఆరాధనోత్సవాలతో పాటు గోకులాష్టమి ఉత్సవాలు నిర్వహించనున్నారు. అభయాంజనేయస్వామి, కాళికామాత ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తారు.